క్లుప్తంగా

భూ భారతి సదస్సు నిర్వహణ తేదీల మార్పు

నిడమనూరు : భూ భారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణలో స్వల్ప మార్పులు చేసినట్లు తహసీల్దార్ జంగాల కృష్ణయ్య తెలిపారు. ఈనెల 17న వల్లాభపురం, 18న తుమ్మడం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం రేగులగడ్డ గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో 125 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. మిస్సింగ్ సర్వే నంబరు17, విస్తీర్ణం సవరణ16, ఆధార్ మార్పు2, పీఓబీ తొలిగింపునకు 1, అసైన్‌మెంట్ 18, ఫౌతి 5 ఇతరములు 66 దరఖాస్తులు వచ్చాయి. రేగులగడ్డ భూభారతి సదస్సులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు దాడి రాజిరెడ్డి, సందీప్, అనిల్, సైదులు, ఫయాజ్, పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల పేరుతో చేస్తున్న దోపిడీని పూర్తిస్థాయిలో అరికట్టాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులోని మహాత్మా జ్యోతిరావుపూలే భవనంలో నిర్వహించిన యువజన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో దాస రాజు జయరాజు, సిద్దంరాజు, నాయిని భాస్కర్, అంజి గౌడ్, గంగాధర్, ఉపేందర్, సుదర్శన్ తదితరులున్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా ఆంజనేయులు


ఆంజనేయులు

చింతపల్లి : ఆర్యవైశ్య సంఘం చింతపల్లి మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన వందనపు ఆంజనేయులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వర నగర్ ఊరే యాదయ్య గార్డెన్స్‌లో నిర్వహించిన మండల ఆర్యవైశ్య సంఘం సర్వేసభ్య సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయన ఎన్నికకు సహకరించిన ఆర్యవసర సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్ పోస్టు స్థానికులకు ఇవ్వాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న పులిచర్ల గ్రామస్తులు

పెద్దవూర : మండలంలోని పులిచర్ల గ్రామానికి నూతనంగా మంజూరైన రెండో అంగన్‌వాడీ కేంద్రానికి అంగన్‌వాడీ టీచర్ పోస్టులో స్థానిక మహిళకు అవకాశం కల్పించాలని శుక్రవారం గ్రామస్తులు సీడీపీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విన్నపాన్ని మన్నించి రెండో అంగన్‌వాడీ కేంద్రాన్ని మంజూరు చేయడంపై ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి చంద్రశేఖర్, బుడిగపాక సత్యనారాయణ, కంభంపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


నాగన్నగౌడ్‌ను సన్మానిస్తున్న కార్మికులు

మాడుగులపల్లి : రాష్ట్రంలోని కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కుక్కడం గ్రామ సమీపంలో గల విశాఖ ఇండస్ట్రియల్ కంపెనీకి వచ్చి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. అనంతరం నాగన్నగౌడ్‌ను కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు ఉన్నారు.

కార్యాలయాలకు స్థలాల కొరత!

- అద్దెభవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ ఆఫీసులు
- భవనాలు మంజూరైనా స్థలాలు లేక నిర్మాణంలో జాప్యం
- ఇబ్బందులు పడుతున్న అధికారులు, ప్రజలు


మార్కెట్ గోదాంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్


సహకార సంఘం పాత భవనంలో కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : నూతనంగా ఏర్పడిన తిరుమలగిరి(సాగర్) మండలంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు స్థలాలు కొరత తీవ్రంగా ఉంది. మండలం ఏర్పడి తొమ్మిదేళ్లు అవుతున్నా ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు లేవనే కారణంతో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సొంత భవనాలు లేకపోవడంతో అసౌకర్యాల నడుమ పాలన కొనసాగుతుంది. తిరుమలగిరి గ్రామపంచాయతీ ఏర్పడిన తరువాత చిన్న అద్దె ఇంట్లో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేశారు.అందులో ఒక గది మాత్రమే ఉండటంతో తహసీల్దార్ ఛాంబర్, రిజిస్ట్రేషన్ గది రెండు ఒకే దాంట్లో కొనసాగించాల్సిన దుస్థితి. పాత సహకారసంఘం కార్యాలయంలో ఎంపీడీవో కార్యాలయంను ఏర్పాటు చేయగా ఇందులో కూడా రెండు గదులు మాత్రమే ఉండటంతో ఎంపీపీ, ఎంపీడీవోల ఛాంబర్లు ఒకే గదిలో ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి. ఇక మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలంటే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించుకోవాల్సిన దుస్థితి. వ్యవసాయ సబ్‌మార్కెట్‌యార్డులోని గోదాముల్లో పోలీస్‌స్టేషన్, రైతు వేదికలో వ్యవసాయశాఖ కార్యాలయం ఏర్పాటు చేశారు. అద్దెకు కూడా అనువైన భవనాలు దొరకకపోవడంతో విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటికీ హాలియా నుంచే పాలన కొనసాగిస్తున్నారు.

పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరైనా..

నూతన తిరుమలగిరి(సాగర్) మండలంలో పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి గాను గత ప్రభుత్వ హయాంలోనే రూ.1.50కోట్ల నిధులు కేటాయించారు. కానీ మండలంలో ఎక్కడా కూడా అనువైన స్థలాలు లేవనే కారణంతో పోలీస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టకుండానే నిలిచిపోయింది. దీంతో ప్రభుత్వం కేటాయించిన నిధులు ఎలాంటి ఉపయోగంలేకుండా పోయింది. అలాగే ఇటీవల మంజూరైన పీహెచ్‌సీ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.43కోట్ల నిధులను కూడా కేటాయించారు. పీహెచ్‌సీ భవన నిర్మాణానికి గాను మండల కేంద్రంలోని రంగుండ్ల రోడ్డులోని ప్రభుత్వ భూమిని ఇటీవల ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ లాగానే పీహెచ్‌సీ భవన నిర్మాణం ముందుకు సాగుతుందా లేదా అని మండలవాసులు అయోమయంలో ఉన్నారు.

మార్కెట్‌యార్డు భూములే దిక్కా?

ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి గాను మండల కేంద్రంలో ఎక్కడా కూడా అనువైన భూములు లేవు. దీంతో స్థానిక వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డు భూములే దిక్కనే నిర్ణయానికి ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చారు. మండల కేంద్రంలోని వ్యవసాయసబ్ మార్కెట్ యార్డు స్థలం సుమారు 17 ఎకరాలు ఉంది. దీనిలో నాలుగు ఎకరాల భూమిని మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేటాయించాలని కోరుతూ హాలియా వ్యవసాయమార్కెట్ పాలకవర్గం ఇటీవల ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కానీ గతంలోనే మార్కెటింగ్ శాఖ ప్రభుత్వం నుంచి ఈ భూమిని నగదు రూపంలో కొనుగోలు చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వం మరలా మార్కెటింగ్ శాఖ నుంచి నగదు రూపంలో కొనుగోలు చేయాలి. కానీ మార్కెటింగ్ శాఖ దానికి ఒప్పుకుంటుందో లేదో అన్నది కూడా ప్రశ్నార్థంగా ఉంది. ఒకవేళ స్థానిక ప్రజాప్రతినిధులు మార్కెటింగ్ శాఖను ఒప్పించినప్పటికి, సీఎంఓ కార్యాలయం నుంచి ప్రత్యేకంగా జీఓ తీయాల్సి ఉంటుందని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి భవన నిర్మాణాలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సొంత భవనాలు నిర్మించాలి



మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. మండలం ఏర్పడిన తొమ్మిదేళ్లు అవుతున్నా నేటికీ ఒక్క కార్యాలయానికి కూడా సొంత భవనం లేకపోవడం బాధాకరం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి సొంత భవనాలను ఏర్పాటు చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలి.

– పాతనబోయిన భాస్కర్, తిరుమలగిరి

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని షాబునగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంను అందజేశారు. అదేవిధంగా మాజీ కౌన్సిలర్ బంటు లక్ష్మీనారాయణ సహకారంతో 50మీటర్ల ప్రహరీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, పౌష్టికాహారం అందించడం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల నడుమ విద్యను అందిస్తున్నందున తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లావూరి బాలు, ప్రధానోపాధ్యాయులు వీరయ్య, మంగమ్మ, హరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి చర్యలు


మురుగు కాల్వలు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

దేవరకొండ : దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్ తెలిపారు.శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాలనీల్లో మురుగు నిల్వ ఉన్న చోట దోమల లార్వా పెరగకుండా ఆయిల్ బాల్స్ వేయడం, స్ప్రే చేయించడం, బ్లీచింగ్ చల్లడం, డ్రైనేజీలను శుభ్రం చేయించడం వంటి చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. నిరుపయోగంగా ఉన్న కూలర్లు, హౌస్‌లలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్, సక్రునాయక్, మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కృత్యాధార బోధనతో అభ్యాసన స్థాయి మెరుగు


పెద్దవూర : వెల్మగూడెం ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ


మిర్యాలగూడ టౌన్ : గాంధీపార్క్ ప్రాథమికోన్నత పాఠశాలలో...

పెద్దవూర: విద్యార్థులకు కృత్యాధార(ఆట, పాటల ద్వారా) బోధనతో అభ్యాసన స్థాయి మెరుగుపడుతుందని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని వెల్మగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎం శ్రీనివాస్, హెచ్ఎం మన్నెం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రహీం, నామిరెడ్డి ప్రశాంతి, వెంకయ్య, అంగన్‌వాడీ టీచర్ పుష్పలత, పాల్గొన్నారు.

గాంధీపార్క్ పాఠశాలలో..

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారరం మిర్యాలగూడ పట్టణంలోని గాంధీ పార్క్ ప్రాథమికోన్నత పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం కురువ చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫాం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్, రామ్‌రెడ్డి, నిర్మల, పార్వతి, వెంకటరమణాచారి, ఏలిషా, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, కిరణ్, సలిమా, నిర్మల, రజిత, సరిత, పద్మ, సంధ్య, రజియాబేగం, వెంకన్న, మధు, నాగమణిలతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.


కొండమల్లేపల్లి : సరస్వతిదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ, తదితరులు

సామూహిక అక్షరాభ్యాసం

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో శుక్రవారం ఎంఈఓ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఉదయ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మమత, ఉపాధ్యాయులు, భవిత సెంటర్ ఉపాధ్యాయులు త్రివేణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు


ఆయిల్ పామ్ సాగును పరిశీలిస్తున్న పతాంజలి కంపెనీ జిల్లా మేనేజర్ మధుసూదన్‌రెడ్డి


ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్‌ను ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ లింగారెడ్డి, తదితరులు

హాలియా : రైతులు ఆయిల్ పాం సాగు చేపడితే రెట్టింపు ఆదాయంతో అధిక లాభాలు పొందవచ్చని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఉద్యానశాఖ సహకారంతో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం అనుమల మండలంలోని ఈశ్వర్ నగర్‌లో రైతు పగడాల చిన్న మారిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మెగా ఆయిల్ ఫాం ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరై ఆయిల్ పామ్ మొక్కలు నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి అనంతరెడ్డి, పతంజలి కంపెనీ డీజీఎం యాదగిరి, నియోజకవర్గ ఉద్యాన శాఖ అధికారి మురళి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్, యడవెల్లి నరేందర్ రెడ్డి, జూపల్లి శ్రీనివాస్, పతంజలి మేనేజర్ మధుసూధన్‌రెడ్డి, సంపత్‌కుమార్, రైతులు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

అడవిదేవులపల్లి : ఆయిల్ పామ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని పతాంజలి కంపెనీ జిల్లా మేనేజర్ డాక్టర్ మధుసూధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెం గ్రామంలో ఉద్యానవన శాఖ సహకారంతో పతాంజలి ఫుడ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సభావత్ బిచ్చానాయక్ పొలంలో వేసిన 'మెగా ఆయిల్ పామ్ ఫ్లాంటేషన్ డ్రైవ్'లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పంతాంజలి కంపెనీ వారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామ్ ఆయిల్ పంట తెలంగాణ రైతులకు వరంలాంటిందని, ప్రతి రైతు కేవలం ఒక్క పామ్ ఆయిల్ మీదనే ఒక ఎకరానికి రూ.1.25లక్షల వరకు నికర ఆదాయం పొందవచ్చన్నారు. అంతర పంటలు వేస్తే అదనంగా రూ.40వేల నుంచి 50వేల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. మొదట మూడేళ్ల పాటు అంతర పంటలుగా వేసుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుకు భారీ ప్రొత్సాహకాలను అందిస్తున్నట్లు తెలిపారు. బిందు సేద్యంపై ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం రాయితీ, బీసీలకు 90శాతం, ఓసీలకు ఐదు ఎకరాల లోపు ఉంటే 80శాతం రాయితీని కల్పిస్తుందన్నారు. దే విధంగా ప్రతి ఎకరానికి 4200 రూపాయల వరకు నిర్వహణ ఖర్చు ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో ఏరియా ఆఫీసర్ డి. సుధాకర్, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ బి. రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ

నిడమనూరు : రైతు భరోసా పథకంలో వానకాలం సాగు సాయం కోసం ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి విజయచంద్ర సూచించారు. ఇటీవల కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా దరఖాస్తుకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు అకౌంట్ వివరాలతో వ్యవసాయం కార్యాలయాన్ని సంప్రదించాలని ఏఈఓ సూచించారు. గతంలో రైతు భరోసా పొందిన రైతులు కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని ఏఈఓ తెలిపారు. బ్యాంకు ఖాతా మార్చుకోవలన్నా రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఏఈఓ తెలిపారు.

చింతపల్లి : రైతు భరోసా పథకం- వానాకాలం 2025లో కొత్తగా పట్టాలు పొందిన రైతులు జూన్ 20 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని అర్హత కలిగిన రైతులు రైతు భరోసాకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి శ్రావణ కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ డాక్యుమెంట్స్ సంబంధిత ఏఈఓలకు సమర్పించాలన్నారు. గతంలో డబ్బులు వచ్చిన వారు జిరాక్స్ పత్రాలు ఇవ్వాలన్సిన అవసరం లేదన్నారు.

కొనసాగుతున్న అమ్మమాట-అంగన్‌వాడీ బాట


ప్రకాశ్‌నగర్‌లో మొక్కలకు నీరు పోస్తున్న సూపర్‌వైజర్ లీలాకుమారి

మిర్యాలగూడ టౌన్ : ఐదేళ్లలోపు చిన్నారుల అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చేపట్టిన అమ్మమాట-అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగుతుంది. పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపు సెక్టార్ పరిధిలోని ప్రకాశ్‌నగర్‌లో, విద్యానగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం-1,2లలో అంగన్‌వాడీబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలాకుమారి, నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సు కలిగిన చిన్నారులను తప్పని సరిగ్గా అంగన్‌వాడీకి పంపించాలని ఐసీడీఎస్ చలకుర్తి సెక్టార్ సూపర్‌వైజర్ గౌసియా బేగం అన్నారు. అంగన్‌వాడీ బడిబాటలో భాగంగా శుక్రవారం నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీచర్లు శారదాదేవి, రాజేశ్వరీ, ఆయా సుజాత, గర్భిణి స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

మిర్యాలగూడ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆశా వర్కర్ యూనియన్ మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 29కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ దయానంద్, నాయుకలు పాపానాయక్, ఆశాలు మహేశ్వరి, పద్మ, శారదా, దేవి, కవిత, రమణకుమారి, తులసీ, సుజాత, సావిత్రి, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిగా ప్రసాద్ సేవలు చిరస్మరణీయం


మద్దెల ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, పల్లా వెంకట్‌రెడ్డి, తదితరులు

దేవరకొండ : పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మద్దెల ప్రసాద్ సేవలు చిరస్మరణీయమని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్‌హాల్ లో నిర్వహించిన ప్రసాద్ సంస్మరణ సభకు ఆయన హాజరై మాట్లాడారు. దేవరకొండ ప్రాంతంలో ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు విద్యను అందించి ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కిందన్నారు.ఆయన మృతి తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ప్రసాద్ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, వివిధ పార్టీల నాయకులు ఎంఏ సిరాజ్‌ఖాన్, పల్లా నర్సింహారెడ్డి, బుచ్చిరెడ్డి, సర్వయ్య, మేకల శ్రీనివాస్‌యాదవ్, వేణుధర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, రుక్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, వారికి పెన్షన్‌తో పాటు ఇంటి స్థలం మంజూరు చేయాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు పన్నాల గోపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు డాక్టర్ తోట నరసింహాచారి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. వేలాదిమంది అమరత్వం, లక్షలాదిమంది పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వ 10సంవత్సరాల పాలనలో ఉద్యమకారులను ఉద్దేశపూర్వకంగా విస్మరించిందని, ఫలితంగా ఉద్యమకారులు ఆర్థికంగా గుర్తింపు లేక మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 18నెలలు అవుతున్నా నేటికీ ఉద్యమకారుల హామీలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఇందూరు సాగర్, గుండెబోయిన నాగేశ్వరరావు, వంటిపాక యాదగిరి, వెంకటేశం, జి.యాదగిరి, ఎల్.క్రాంతికుమార్, ధీరావత్ వీరనాయక్, బి.నర్సింహులు, రాపోలు శ్రీనివాసులు, కల్లూరి అయోధ్య పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది


బసిరెడ్డిపల్లిలో విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎన్ఆర్ఐ వెంకటేశ్వర్లు

పెద్దవూర : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు దాతల అందిస్తున్న సహకారం మరువలేనిదని ఎంఈఓ తరి రాములు అన్నారు. శుక్రవారం మండలంలోని బసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులను గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఇసురాజు వెంకటేశ్వర్లు, నోట్‌బుక్స్‌ను హాలియాకు చెందిన రమేష్‌లు అందజేశారు. అనంతరం పాఠశాలలో నూతనంగా నిర్మించిన బాత్‌రూం, హ్యాండ్‌వాష్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పంచాయతీ కార్యదర్శి రిక్కల శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూల మలుపు


దాచారం గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న మూలమలుపు

మాడుగులపల్లి : మండల కేంద్రం నుంచి దాచారం గ్రామానికి వెళ్లే దారిలో రహదారిపై పలు చోట్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. రెండు కిలోమీటర్ల దూరంలోనే నాలుగైదు మూల మలుపులు ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనం పూర్తిగా దగ్గరకు వచ్చేవరకు కనపడడం లేదు. చీకటి అయితే మరీ ఇబ్బంది అవుతుంది. మలుపులు ఉన్న చోట ఏదైనా ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.

అసంపూర్తిగా పంచాయతీ భవనం


చింతచెట్టుతండాలో స్లాబ్ దశలో నిలిచిన పంచాయతీ భవనం

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని చింతచెట్టుతండా గ్రామపంచాయతీ భవన నిర్మాణం గత ప్రభుత్వం 2023లో ఎంజీఎన్ఆర్ఈఎస్ నిధుల కింద రూ.20లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని చేపట్టింది. ఈ భవన నిర్మాణాన్ని సంబంధించి కాంట్రాక్టు దక్కించుకున్న గుత్తేదారు స్లాబ్ వరకు భవన నిర్మాణాన్ని చేపట్టి చేతులు దులుపుకున్నాడు. ఈ విషయమై ఆరా తీయగా సదరు బిల్లులు రాకపోవడంతో మధ్యలోనే భవన నిర్మాణం ఆపివేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ఈ విషయమై ఇన్‌చార్జ్ పంచాయతీరాజ్ ఏఈ ఇందిరాను వివరణ కోరగా స్లాబ్ వరకు పూర్తి చేసిన అనంతర బిల్లులు రాకపోవడంతో మధ్యలో ఆగిపోయిన మాట వాస్తవమేనని త్వరలోనే మిగతా బిల్లులు వచ్చిన అనంతరం మిగతా సగం పనిని పూర్తి చేసి భవన నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు.